అంగన్‌వాడీ కేంద్రాలకు మహర్దశ

- 'సక్ష్యం'తో కేంద్రాల్లో ఆధునిక హంగులు
- జిల్లాలో 401 కేంద్రాల ఎంపిక

సీతారామపురం : ఆరేళ్లలోపు పిల్లలు, గర్భిణులు, బాలింతలకు సమగ్ర పోషణ ఆరోగ్యంపై అవగాహన, కిశోర బాలికల వికాసంతో సంపూర్ణ ఆరోగ్యవంత సమాజ నిర్మాణమే లక్ష్యంగా అంగన్‌వాడీ కేంద్రాలు పని చేస్తున్నాయి. అయితే క్షేత్రస్థాయిలో కేంద్రాల్లో అందుకు తగిన వసతి సౌకర్యాలు లేక నూరు శాతం ఫలితాలు అందుకోలేక చతికిల పడుతున్నాయి. వీటిని అధిగమించేందుకు కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో రాష్ట్ర మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ అడుగులు వేస్తోంది. అంగన్‌వాడీ కేంద్రాల్లో మెరుగైన వసతుల కల్పనే లక్ష్యంగా స్టిమ్యులేటింగ్ అడ్వాన్స్‌డ్ నాలెడ్జ్ ఫర్ సస్టయినబుల్ హెల్త్ మేనేజ్మెంట్ (సక్ష్యం) కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది.

జిల్లాలోని 12 ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 2,934 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వాటిలో 13,204 మంది గర్భిణులు, 12,002 మంది బాలింతలు, 1,24,628 మంది ఆరేళ్లలోపు చిన్నారులు ఉన్నారు. జిల్లాలోని 12 ప్రాజెక్ట్‌ల పరిధిలోని 401 కేంద్రాలు సక్ష్యం కార్యక్రమం కింద ఎంపికయ్యాయి. అందులో భాగంగా పోషకాల తోట (న్యూట్రీగార్డెన్) పేరిట సేంద్రియ పద్ధతిలో కూరగాయలు, ఆకుకూరలు, పండ్ల మొక్కలను పెంచనున్నారు. వాటిని పిల్లలు, గర్భిణులు, బాలింతలకు పంపిణీ చేస్తారు. అలాగే రక్షిత మంచి నీటిని అందించేందుకు వాటర్ ఫిల్టర్లను అమర్చనున్నారు. వీటి నిర్మాణ బాధ్యతలను పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం చూసుకుంటుంది. సక్ష్యం కింద ఎంపికైన కేంద్రాలకు పోషకాల తోటకు రూ.10వేలు, ఇంకుడు గుంతలకు రూ.16వేలు, ఇతర సదుపాయాలకు రూ.19,800 కేటాయించారు.


అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు


పోషకాల తోటలో ఆకుకూరల సాగు

సమకూరనున్న సదుపాయాలు

తల్లీబిడ్డల ఆరోగ్య పరిరక్షణతో పాటు బాలల శారీరక మానసిక ఎదుగుదలకు అవసరమైన వసతులు, ఆహ్లాదకర వాతావరణాన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో కల్పించనున్నారు. విద్యాబోధన మెరుగునకు అవసరమైన చర్యలు చేపట్టి పరిజ్ఞానాన్ని పెంపొందించేందుకు వివిధ రకాల బొమ్మలు, చిత్రాలు, ఆట వస్తువులను ఏర్పాటు చేయనున్నారు. ఫర్నిచర్‌ను ఏర్పాటు చేయడంతో పాటు చిన్నారులను ఆకట్టుకునేలా బోధన చేసేందుకు దృశ్య, శ్రవణ విద్యకు అవసరమైన పరికరాలను సమకూర్చనున్నారు.

401 కేంద్రాల ఎంపిక



జిల్లాలో 401 అంగన్‌వాడీ కేంద్రాలు సక్ష్యం పథకానికి ఎంపికయ్యాయి. ఆయా కేంద్రాల్లో పోషకాల తోటలు, ఇంకుడు గుంతలు, ఇతర సదుపాయాలు కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం నిధులు సైతం విడుదల చేసింది. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆహ్లాదకర వాతావరణాన్ని కల్పించడంతో పాటు పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందిస్తాం.

– హేనాసుజన్, పీడీ, ఐసీడీఎస్

హిందూ సమ్మేళనం


మాట్లాడుతున్న వక్తలు

సంగం: స్థానిక ఆంజనేయస్వామి ఆలయంలో విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో హిందూ సమ్మేళనాన్ని ఆదివారం నిర్వహించారు. సంగం తిరుమన కొండ జ్ఞానపీఠం పీఠాధిపతి రాజరాజేశ్వరానంద స్వామి, ఆర్‌ఎస్‌ఎస్ ప్రముఖులు ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. హిందూ ధర్మ పరిరక్షణకు హిందువులందరూ కలిసికట్టుగా ఉంటే ధర్మం సనాతనం నిత్యనూతనం అవుతుందని తెలిపారు. జనవరి 5న విజయవాడలో జరిగే హైందవ శంఖారావం కార్యక్రమంలో హిందూ బంధువులందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఆలయాల్లో భజనలు, కీర్తనలు, ధర్మ ప్రసంగాలు జరగాలన్నారు. ఆలయాల్లోని అన్యమత ఉద్యోగులను తొలగించాలని డిమాండ్ చేశారు. ఆలయాల ఆదాయాన్ని ధర్మ ప్రచారానికి, సేవలకు మాత్రమే ఉపయోగించాలని కోరారు. ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా సంఘ్ చాలక్ బాల సుబ్బారావు, బుచ్చి ఖండ్ చాలక్ కేశవయ్య, ఖండ్ కార్యవాహ వెంకట్‌నాథ్, ఎస్‌ఎస్‌ఎఫ్ ధర్మ ప్రచారక్ శ్రీనివాసులు, ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘ నాయకులు సురేందర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అండర్‌పాస్ పేరుతో కాలయాపన

కావలి: పట్టణంలోని పెద్దపవని రోడ్డులో రైల్వే శాఖ ఫ్లైఓవర్ 15 ఏళ్లగా గాల్లో ఉండగా దానిని పూర్తి చేసేందుకు గత వైఎస్ జగన్ ప్రభుత్వ హయాంలో నిధులు మంజూరు చేయించామని మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రస్తుతం కావలి–దుత్తలూరు జాతీయ రహదారి విస్తరణ పనులు చేపడుతున్న కాంట్రాక్టర్ ఫ్లైఓవర్ నిర్మాణ పనులను దక్కించుకున్నారని చెప్పారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆ పనిని రద్దు చేసిందని చెప్పారు. గతంలో ఫ్లైఓవర్ నిర్మిస్తే పెద్దపవని రోడ్డులోని చిరువ్యాపారులు జీవనోపాధి కోల్పోతారని, సాంకేతిక నిపుణులతో చర్చించి అండర్ పాస్ నిర్మిస్తే సరిపోతుందని తాను చెప్పానన్నారు. అయితే అప్పట్లో టీడీపీ నాయకులు ఖాతరు చేయకుండా ఫ్లైఓవర్ నిర్మించాలని పట్టుబట్టారని గుర్తుచేశారు. దీంతో ఫ్లైఓవర్ నిర్మాణానికి తాను కూడా సహకరించానని చెప్పారు. ప్రస్తుత ఎమ్మెల్యే డీవీ కృష్ణారెడ్డి ఫ్లైఓవర్ నిర్మాణం వీలు పడదని, అండర్ పాస్ నిర్మాణం చేపట్టాలని అంటున్నారన్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో అక్కడ అండర్ పాస్ నిర్మాణం సాధ్యపడదనే విషయం తెలిసినా, ప్రజలను మభ్యపెట్టి కాలయాపన చేయడానికే అండర్‌పాస్ అంటున్నారన్నారు.

బీసీ బాలుర వసతి గృహంలో తనిఖీలు


విద్యార్థులకు రగ్గులు అందజేస్తున్న పీడీ వేణుగోపాల్

సోమశిల: అనంతసాగరంలోని బీసీ బాలుర వసతిగృహాన్ని హౌసింగ్ పీడీ టీ వేణుగోపాల్ ఆదివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు, కలెక్టర్ సూచనలతో వసతి గృహాలను సందర్శించి విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలను పరిశీలిస్తున్నామని తెలిపారు. ప్రధానంగా అద్దె భవనంలో విద్యార్థులకు తగినన్ని గదులు లేవని, మరుగుదొడ్లు లేవని గుర్తించామని తెలిపారు. విద్యార్థులకు మెరుగైన వసతి కల్పించేందుకు అవసరమైన అన్ని సౌకర్యాలపై నివేదికను తయారు చేసి కలెక్టర్‌కు అందజేస్తామన్నారు. అనంతరం విద్యార్థులకు రగ్గులను పంపిణీ చేశారు. ఆయన వెంట వార్డెన్ శ్రీనివాసరావు, అనంతసాగరం వైద్యారోగ్యశాఖ సిబ్బంది, ఎంపీహెచ్ఈఓ మంద చిన్నయ్య, హెల్త్ అసిస్టెంట్ టీవీఆర్వీ ప్రసాద్ ఉన్నారు.

ప్రజలకు చేరువగా ఆర్టీసీ సేవలు



ఉదయగిరి: ఆర్టీసీ సేవలను ప్రజలకు మరింత చేరువచేసేందుకు కృషి చేస్తామని నెల్లూరు ఆర్టీసీ జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి పేర్కొన్నారు. ఉదయగిరిలో బీజేపీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసినప్పటికీ ప్రాథమిక సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయన్నారు. ప్రభుత్వం దృష్టికి సమస్యలను తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. అనంతరం సురేష్‌రెడ్డిని బీజేపీ నాయకులు, కార్యకర్తలు, ఆర్టీసీ కార్మికులు, అంగన్‌వాడీ కార్యకర్తలు సత్కరించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గుంటుపల్లి భరత్, స్థానిక నాయకులు కదిరి వెంకట్రావు, ఎం సురేష్‌రెడ్డి, పులిచర్ల నారాయణరెడ్డి, ఆవుల రోశయ్య, మేకపాటి మాల్యాద్రి, ఎం సుబ్బరాజు, షాజహాన్, గడ్డం ప్రసాద్, ఎం సురేష్‌రెడ్డి, చల్లా సుబ్బరత్నం, తదితరులు పాల్గొన్నారు.

దుస్తులు ఆరేసుకునేందుకు పాట్లు



కావలి: పట్టణంలోని ప్రభుత్వ బీసీ బాలుర వసతి గృహంలోని విద్యార్థులు ఉతికిన దుస్తులు ఆరేసుకునేందుకు నానా పాట్లు పడుతున్నారు. వసతిగృహ ప్రాంగణంలో దుస్తులు ఆరేసుకునేందుకు ఎలాంటి తీగలు ఏర్పాటు చేయలేదు. దీంతో వసతిగృహంలోని మెట్లు, పిట్టగోడలు, పాడుబడిన ట్యాంకర్లు, తదితర ప్రాంతాల్లో దుస్తులు ఆరేసుకోవాల్సిన దుస్థితి నెలకొంది. ఫలితంగా దుస్తులు మట్టి కొట్టుకుంటున్నాయి. మరోవైపున నీడలో ఆరేయడం వల్ల దుస్తులు ఆరక ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు వాపోతున్నారు.

వర్షాలకు నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

బిట్రగుంట: బోగోలు మండలంలో ఇటీవల కురిసిన వర్షాలకు నారుమళ్లు దెబ్బతిని నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మద్దిబోయిన వీరరఘు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. వర్షాలకు నారుమళ్లు దెబ్బతినడంతో సన్న, చిన్నకారు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. . గతంలో ప్రభుత్వం తుపాన్లు, భారీ వర్షాల కారణంగా నారుమళ్లు దెబ్బతింటే తక్షణ సాయంగా రాయితీపై రైతులకు విత్తనాలు అందజేసేదని గుర్తుచేశారు. ప్రస్తుతం వందలాది మంది రైతులు నష్టపోయినా వ్యవసాయశాఖ అధికారులు స్పందించడం లేదన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులకు ఉచితంగా విత్తనాలు పంపిణీ చేయాలని కోరారు.

అన్నదానం



కావలి: స్థానిక సంయుక్త సేవా సంస్థ కార్యాలయంలోని పేద విద్యార్థులకు జవహర్ భారతి కళాశాల ఉద్యోగులు రమణమూర్తి–మహేశ్వరి దంపతుల ఆదివారం అన్నదానం చేశారు. తమ పెళ్లిరోజును పురస్కరించుకుని విద్యార్థులకు అన్నదానం చేసినట్లు వారు తెలిపారు. విద్యతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని, విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. దాతలకు సంయుక్త సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర ధన్యవాదాలు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో మాతమ్మకు పొంగళ్లు



సోమశిల: అనంతసాగరం మండలం పడమటికంభంపాడులో గ్రామదేవత మాతమ్మతల్లికి సామూహిక పొంగళ్ల కార్యక్రమాన్ని ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామస్తులు సామూహికంగా మాతమ్మ ఆలయం వద్దకు చేరుకుని పొంగళ్లు పెట్టి నైవేద్యాలు సమర్పించారు. అనంతరం మాతమ్మ ఉత్సవమూర్తిని విశేషంగా అలంకరించి గ్రామోత్సవం జరిపారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేశారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

చేజర్ల: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చిత్తలూరు సీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ నవీన్‌కుమార్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో సూచించారు. ఇటీవల కురిసిన వర్షాలకు తాగునీరు కలుషితమై డయేరియా ప్రబలే అవకాశం ఉందన్నారు. అందువల్ల కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. వేడి వేడి ఆహార పదార్థాలను తీసుకోవాలన్నారు. దోమలు వ్యాప్తి చెందకుండా ఇళ్ల పరిసరాల్లో మురుగు నిల్వలు, ఇళ్లలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని సూచించారు. దోమలతో విషజ్వరాలు వ్యాప్తి చెందే అవకాశం ఉన్నందున వా నుంచి రక్షణకు దోమతెరలను వాడుకోవాలని తెలిపారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో సౌకర్యాలు కరువు


ఉరుస్తున్న శ్లాబ్, ఒంగిపోయిన ఫ్యాన్ రెక్కలు

ఆత్మకూరురూరల్: ఆత్మకూరులోని ఆర్టీసీ బస్‌స్టేషన్‌లో సరైన సౌకర్యాలు లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. బస్‌స్టేషన్ శ్లాబ్ దెబ్బతిని వర్షం పడితే కంట్రోలర్ గదితో పాటు ప్రయాణికులు వేచి ఉండే ప్రాంతం ఉరుస్తోంది. దీంతో బస్టాండ్‌లో వేచి ఉండేందుకు ప్రయాణికుల ఇబ్బందులు పడుతున్నారు. ప్రయాణికుల కోసం ఏర్పాటు చేసిన కుర్చీలు సైతం కుంగిపోయి పెద్దలు కూర్చునేందుకు వీల్లేకుండా ఉన్నాయి. ఫ్యాన్లు సైతం సరిగా పనిచేయకపోవడంతో ఎండకు, దోమలకు ప్రయాణికులు అల్లాడుతున్నారు. నిత్యం ఆత్మకూరు పరిసర గ్రామాలకు చెందిన విద్యార్థులతో పాటు ప్రయాణికులు పెద్దసంఖ్యలో బస్‌స్టేషన్‌కు వచ్చి రాకపోకలు సాగిస్తుంటారు. అయినా ఆర్టీసీ అధికారులు సౌకర్యాలను కల్పించడంలో నిర్లక్ష్యం వహించడంతో ఇబ్బందులు పడుతున్నామని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆర్టీసీ ఉన్నతాధికారులు తక్షణం స్పందించి కనీస సౌకర్యాలు కల్పించాలని వారు కోరుతున్నారు.

పోలీసులకు భారంగా కమాండ్ కంట్రోల్ భవనం


పోలీస్ కమాండ్ కంట్రోల్ భవనం

కావలి: పట్టణంలోని పోలీసు కమాండ్ కంట్రోల్ భవనం పోలీసులకు భారంగా మారింది. గతం పనిచేసిన పోలీసు ఉన్నతాధికారులు పట్టణంలోని సీసీకెమెరాల పర్యవేక్షణతో పాటు పోలీసుల సమావేశాలు, విశ్రాంతి గదుల కోసం ప్రత్యేకంగా ఈ భవనాన్ని నిర్మించారు. అయితే భవన నిర్వహణకు అవసరమైన ఆర్థిక వెసులుబాటు విషయాన్ని విస్మరించారు. అదే నేడు భవనానికి సమస్యగా మారింది. పట్టణంలోని సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో కమాండ్ కంట్రోల్ సెంటర్ విషయాన్నే పోలీసులే మర్చిపోయారు. ఈ భవనంలో స్థానిక పోలీసు అధికారులు సైతం సమావేశాలు పెట్టుకోవడం లేదు. ఎస్పీ, కలెక్టర్, న్యాయమూర్తులు, మంత్రులు, ఇతర వీవీఐపీలు వచ్చినప్పుడు మాత్రం భవనంలో కాసేపు విశ్రాంతి తీసుకుని వెళ్తున్నారు. భవన నిర్వహణకు ఆర్థిక వెసులుబాటు లేకపోవడంతో అది పోలీసులకు గుదిబండగా మారింది. అప్పట్లో కమాండ్ కంట్రోల్ భవనం స్థానంలో పోలీసులకు డార్మెంటరీ, కల్యాణ మండపాన్ని నిర్మించి పోలీసులకు ఉచితంగా, బయటవారికి అద్దెలకు ఇవ్వడం ద్వారా ఆర్థిక భారం ఉండదని పలువురు పోలీసులు సూచించినప్పటికి పోలీసులు అధికారులు పెడ చెవినపెట్టారు. ప్రస్తుతం భవన నిర్వహణకు ఆర్థిక వెసులుబాటు లేకపోవడంతో భవనం నిరుపయోగంగా మారింది.

సారూ..కాస్తా రైల్వేస్టేషన్‌కు దారి చెప్తారా?



కావలి: కావలి రైల్వే స్టేషన్ అధికారులు ప్రయాణికుల విషయంలో అడుగడుగునా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. రైల్వే స్టేషన్‌కు వెళ్లే దారిని తెలియజేస్తూ ఎక్కడా సూచిక బోర్డులను ఏర్పాటు చేయలేదు. దీంతో ఇతర ప్రాంతాలకు చెందిన ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కనిపించిన వారందరిని అడుగుతూ స్టేషన్ వద్దకు చేరుకోవాల్సి వస్తోంది. తీరా స్టేషన్ వద్దకు చేరుకున్నా అక్కడ విచిత్రమైన అనుభవం ఎదురవుతోంది. రైల్వే స్టేషన్ ముందు ఎత్తైన ప్రైవేట్ భవనాలు ఉన్నాయి. అవి పరదాలు మాదిరిగా అడ్డంగా ఉండి స్టేషన్ ప్రవేశ మార్గం కనిపించడం లేదు. దీంతో దుకాణదారులు, అటుగా పోయే వారిని అడిగి రైల్వే స్టేషన్‌కు చేరుకోవాల్సి వస్తోంది. కనీసం రైల్వే స్టేషన్ ముందు కూడా బోర్డు పెట్టడానికి ఇష్టంలేదన్నట్లుగా రైల్వే అధికారులు వ్యవహరిస్తుండడంపై ప్రయాణికులు మండిపడుతున్నారు.

ప్రమాదభరితంగా హైవే అండర్‌పాస్



తుమ్మలపెంట రోడ్డులో నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన అండర్‌పాస్

కావలి: పట్టణ పరిధిలో ఉన్న తుమ్మలపెంటరోడ్డు హైవే అండర్ పాస్ ప్రమాదభరితంగా ఉంది. పట్టణం నుంచి తుమ్మలపెంట బీచ్ రోడ్డు మీదుగా 30 గ్రామాల ప్రజల రాకపోకలు సాగిస్తుంటారు. అలాగే జాతీయ రహదారి నుంచి బీచ్‌రోడ్డు లోకి, బీచ్ రోడ్డు నుంచి జాతీయ రహదారికి వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. జాతీయ రహదారి భద్రత నిబంధనల మేరకు అండర్ పాస్ వద్ద నాలుగు అప్రోచ్ రోడ్లు నిర్మించాలి. అప్రోచ్ రోడ్ల నుంచి అండర్ పాస్‌లోకి వెళ్లే వద్ద విశాలంగా రోడ్లను నిర్మించాలి. అలాగే జాతీయ రహదారికి కనీసం పదిహేను అడుగుల దూరంలో అప్రోచ్ రోడ్లు ఉండాలి. అప్రోచ్ రోడ్లు అండర్ పాస్ ముఖం వద్దకు నేరుగా చేరుకోకుండా దూరంగా నిర్మించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. తుమ్మలపెంట రోడ్డు అండర్ పాస్ వద్ద ఈ నిబంధనలను కాంట్రాక్టర్ పట్టించుకోలేదు. అప్రోచ్ రోడ్లను నాసిరకంగా నిర్మించారు. అప్రోచ్ రోడ్డు కు ఇరువైపులా రక్షణ కోసం ఇనుప రెయిలింగ్, పిట్ట గోడలు నిర్మించాల్సి ఉండగా, వాటిని కూడా పట్టించుకోలేదు. దీంతో అండర్‌పాస్‌లను క్రాస్ చేసే క్రమంలో వాహనదారులు నిత్యం ప్రమాదాలకు గురవుతున్నారు. ఏడాది క్రితం కావలి పట్టణానికి చెందిన సచివాలయ ఉద్యోగి శిరీష విధులకు వెళ్తూ తుమ్మలపెంట రోడ్డులోని అండర్ పాస్‌ను క్రాస్‌చేసే క్రమంలో ప్రమాదానికి గురై అక్కడికక్కడే మరణించారు. మరో గ్రామ సచివాలయ ఉద్యోగిని తీవ్రంగా గాయపడింది. ఇప్పటికైనా జాతీయ రహ దారి అధికారులు స్పందించి అండ్‌పాస్ వద్ద అప్రోచ్ రోడ్లను విస్తరించి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

రేపు పెన్షనర్లకు క్రీడా పోటీలు

కావలి: ఈ నెల 17న ఆలిండియా పెన్షనర్స్ డేను పురస్కరించుకుని కావలి రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం పెన్షనర్లకు క్రీడాపోటీలను నిర్వహించనున్నట్లు ఆ సంఘ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయగిరి రోడ్డులోని క్రీడా శాఖ మైదానంలో ఉదయం 9 గంటలకు అవుట్‌డోర్ క్రీడాపోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం పెన్షనర్స్ భవన్‌లో ఇండోర్ గేమ్స్ నిర్వహించనున్నట్లు చెప్పారు. పెన్షనర్లందరూ పాల్గొనాలని కోరారు.

రేపు డయల్ యువర్ ఆర్టీసీ డీఎం

ఆత్మకూరు: ఆర్టీసీ ప్రయాణికుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 10న ఉదయం 11 నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ ఆర్టీసీ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆత్మకూరు డిపో మేనేజర్ కరీమున్నీసా ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆత్మకూరు డిపో పరిధిలోని ప్రయాణికులు తమ సమస్యలతో పాటు సలహాలు, సూచనలను 99592 25645 నంబర్‌కు ఫోన్ చేసి తెలియజేయాలని కోరారు.

ప్రమాద బాధితులకు ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలి

కావలి: పిడుగురాళ్ల వద్ద ఆదివారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాద ఘటనపై కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కావలి మండలం సిరిపురం గ్రామానికి చెందిన నలుగురు రోడ్డు ప్రమాదంలో మరణించడం తనను తీవ్రంగా కలిచివేసిందన్నారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నామన్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు.

ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేయాలని వినతి

వరికుంటపాడు: తూర్పుబోయమడుగుల పంచాయతీ పరిధిలోని అలివేలుమంగాపురం బీసీకాలనీలో ఆర్వో ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు. కాలనీలో సుమారు 50 కుటుంబాలు ఉన్నాయి. మంచినీటి బోర్లలో వచ్చేవి ఫ్లోరైడ్ నీరు కావడంతో కిలోమీటర్ దూరంలో ఉన్న బోయమడుగులకు వెళ్లి మినరల్ వాటర్‌ను తెచ్చుకుని తాగాల్సి వస్తోందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి కాలనీలో మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

ప్రీక్రిస్మస్ వేడుకలు

ఆత్మకూరు: పట్టణంలోని సెంటినరి తెలుగు బాప్టిస్ట్ చర్చిలో ప్రీక్రిస్మస్ వేడుకల్లో భాగంగా స్త్రీల ప్రత్యేక కూడికను పాస్టర్ జాన్‌చంద్రపాల్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. మహిళలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి క్యాండిల్స్ చేతబట్టి క్రీస్తు గీతాలను ఆలపిస్తూ పట్టణ వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. చర్చి నిర్వాహకులు నందవరం ప్రసాద్, భాస్కర్ పాల్గొన్నారు.

24 మద్యం సీసాలు స్వాధీనం

కావలి: మండలంలోని చలంచర్ల, కొత్తపల్లిలో మద్యం అక్రమంగా విక్రయిస్తున్నారనే సమాచారంతో కావలి ఎక్సైజ్ పోలీసులు ఆదివారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో మొగిలిగుండ్లలో కోటేశ్వరరావు వద్ద 11 క్వార్టర్ బాటిళ్లు, కొత్తపల్లిలో చిమ్మిలి మాల్యాద్రి వద్ద 13 క్వార్టర్ బాటిళ్లు స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేసినట్లు కావలి ఎక్సైజ్ ఎస్సై ఎం దేవిక తెలిపారు.

క్లుప్తంగా

వైభవంగా అయ్యప్ప పడి పూజోత్సవం



జలదంకి: స్థానిక జానకీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో అయ్యప్ప పడి పూజోత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. తొలుత అయ్యప్పస్వామికి విశేషాభిషేకాలు, నిర్వహించారు. అనంతరం అయ్యప్పస్వామి ఉత్సవ మూర్తిని విశేషంగా అలంకరించి గ్రామోత్సవం జరిపారు. అనంతరం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై అయ్యప్పస్వామిని కొలువుదీర్చి పడిపూజోత్సవం నిర్వహించారు. జలదంకి పరిసర ప్రాంతాలకు చెందిన అయ్యప్ప మాల ధారులు పాల్గొని భజనలు చేశారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

రక్త నమూనాల సేకరణ



వరికుంటపాడు: మండలంలోని తిమ్మారెడ్డిపల్లిలో మలేరియా సబ్‌యూనిట్ అధికారి నౌషాద్‌బాబు, సీహెచ్ఓ రాజశేఖరరాజు ఆధ్వర్యంలో వైద్యారోగ్య సిబ్బంది 300 మంది నుంచి రక్త నమూనాలను శనివారం రాత్రి సేకరించారు. గ్రామంలో బోధకాలు కేసులు నమోదైన నేపథ్యంలో ఇంకా ఎవరికైనా లక్షణాలు ఉన్నాయోమోనని గుర్తించేందుకు ముందుస్తు జాగ్రత్తగా ఇంటింటికి తిరిగి రక్తనమూనాలు సేకరించి నెల్లూరు ల్యాబ్‌కు పంపుతున్నట్లు వారు తెలిపారు. హెల్త్ సూపర్‌వైజర్ వెంకటయ్య పాల్గొన్నారు.

'కోహా ఇంటిగ్రేటెడ్ లైబ్రరీ సిస్టం' పుస్తకావిష్కరణ



కావలి : పట్టణంలోని పీబీఆర్ విశ్వోదయ ఇన్‌స్టిట్యూట్ అఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్‌లో లైబ్రేరియన్‌గా పనిచేస్తున్న డాక్టర్ ఓ శేషయ్య 'కోహా ఇంటిగ్రేటెడ్ లైబ్రరీ సిస్టం' పుస్తకాన్ని రచించారు. తిరుపతిలోని శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం ప్రాంగణంలో జరిగిన టెంపుల్–2024 జాతీయ సెమినార్‌లో వర్సిటీ వీసీ సీహెచ్ అప్పారావు, రిజిస్ట్రార్ ఎం.భూపతి నాయుడు, ద్రావిడ వర్సిటీ వీసీ ఎం దొరస్వామినాయుడు చేతుల మీదుగా పుస్తకాన్ని ఆవిష్కరించినట్లు శేషయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రంథాలయాలను సమర్థవంతంగా నిర్వహించడంలో, డిజిటలైజేషన్ చేయడంలో పుస్తకం దోహదపడుతుందని ఆయన వివరించారు.

వాహనాల తనిఖీ



సంగం: సంగం బ్యారేజ్ వద్ద ఆత్మకూరు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రాములు ఆదివారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుని వెళ్తున్న వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఆటో డ్రైవర్లు విధిగా ఆటో, డ్రైవింగ్ లైసెన్సులు కలిగి ఉండాలని, పరిమితి మేరకే ప్రయాణికులను ఎక్కించుకోవాలని, లేకపోతే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

స్విమ్మింగ్ పోటీల్లో మణికంఠా సత్తా



సీతారామపురం: విశాఖపట్నంలో శని, ఆదివారాల్లో జరిగిన సౌత్‌జోన్ రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీల్లో సీతారామపురంలోని బెస్తకాలనీకి చెందిన కానిస్టేబుల్ చెన్నయ్య కుమారుడు మణికంఠ సత్తా చాటాడు. 9వ ఏపీ వాటర్ సబ్‌జూనియర్ మరియు జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ ఆక్వా చాంపియన్‌షిప్–2024 స్విమ్మింగ్ పోటీల్లో బ్యాక్‌స్ట్రోక్ 50, 100, 200 మీటర్ల విభాగాల్లో మణికంఠ మూడు కాంస్య పతాకాలను సాధించాడు. ఈ సందర్భంగా మణికంఠను సీతారామపురం గ్రామస్తులు అభినందించారు.

దాడిపై ఫిర్యాదు

కావలి: తమపై ఆదిశేషారెడ్డి అనే వ్యక్తి దాడికి పాల్పడ్డాడని పట్టణంలోని జనతాపేటలో ఉన్న ఫేస్ కంప్యూటర్స్ అధినేత పగడాల శ్రీనివాస్, సతీమణి, న్యాయవాది హేమలత కావలి రెండో పట్టణ పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశారు. ఇటీవల ఫేస్ కంప్యూటర్ నిర్వహిస్తున్న భవనాన్ని ఆదిశేషారెడ్డి కొనుగోలు చేశారు. భవనం మరమ్మతుల విషయంలో శ్రీనివాస్ దంపతులు, ఆదిశేషారెడ్డి నడుమ వాగ్వాదం నెలకొంది. ఈ క్రమంలో ఆదిశేషారెడ్డి తమపై దాడి చేశారని పగడాల శ్రీనివాస్ దంపతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అలాగే భవన యజమాని ఆదిశేషారెడ్డి కూడా కౌంటర్ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఇరువురి ఫిర్యాదులపై విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.